ఏ కులానికి అన్యాయం జరిగినా సహించేది లేదు

మంద కృష్ణ మాదిగ

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణలో ఏ ఒక్క కులానికి అన్యాయం జరిగినా సహించేది లేదని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎస్సీ ఉపకులాల ఆధ్వర్యంలో నేతకాని మహార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ అధ్యక్షతన శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎస్సీల్లోని అన్ని కులాల న్యాయం జరిగే వరకు ఎన్ని సంవత్సరాలైనా పోరాటం చేస్తామని, బాధితులకు అండగా ఉంటామని మంద కృష్ణ మాదిగ తెలిపారు. వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ అనుకూలంగా ఉందని, కాని పార్టీలోని మాల నాయకులు అడ్డుపడుతున్నారని ఆయన ఆరోపించారు. ఏపీలో అక్కడి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్గీకరణకు అనుకూలంగా ఉన్నారని, కాని మాల కులస్తులే అడ్డుపడుతున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు దేశ ప్రధాని నరేంద్రమోదీ పూర్తిగా సహకరించారని చెప్పారు.

దేశ వ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టాలి

కాచిగూడ: దేశ ప్రధాని నరేంద్ర మోదీ నిజంగా బీసీ బిడ్డ అయితే దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు బీసీ కులగణన చేపట్టాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. బీసీల జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. శుక్రవారం కాచిగూడలో ఆయన బీసీ నేతలతో కలిసి మాట్లాడుతూ... పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి బీసీల సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

పనిచేసే కార్యకర్తలను ఆదుకుంటాం

చిక్కడపల్లి: బీజేపీ కోసం కష్టించి పనిచేసే కార్యకర్తలను పార్టీ ఆదుకుంటోందని మాజీ పార్లమెంటు సభ్యులు, జాతీయ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం ఓబీసీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కార్యవర్గ సభ్యులు దోనేటి సత్యం ఇటీవల హార్ట్‌కు స్టంట్ పడిన విషయం తెలుకుని జవహర్‌నగర్‌లోని సత్యం నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యం పార్టీ సభ్యత్వం, పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని నర్సయ్యగౌడ్ అభినందించి ఆరోగ్య సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా సోషల్ మీడియా కో-కన్వీనర్ ఓబీసీ మోర్చా తొలుపునూరి రమేష్‌గౌడ్, ఉల్లాస్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్

ముషీరాబాద్: విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ముషీరాబాద్ విద్యా మండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వరూపారాణి మాట్లాడుతూ.. 10వ తరగతి విద్యార్థులు పట్టుదలతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్ యాదవ్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

కాచిగూడ: ప్రతిభ కలిగిన విద్యార్థులకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణను ఇస్తున్నట్లు సెయింట్ మేరీస్ సెంటినరీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.ఆంథోని వినయ్ తెలిపారు. ఆయా కోర్సులను అభ్యసిస్తున్న డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ పరీక్షను నిర్వహించినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం టెక్స్ అకాడమీ ఆధ్వర్యంలో బీకాం విద్యార్థులకు నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణకు ఎంపికైన విద్యార్థులు రాబర్ట్ లూయిస్, ఫెడ్రోజా పాట్రిక్, కార్తీక్, షయేస్తా, అరిబ్, రాజును ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

వర్గీకరణ పోరాటాన్ని సజీవంగా నిలిపింది కార్యకర్తలే..

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణ పోరాటాన్ని మూడు దశాబ్దాల పాటు సజీవంగా నిలిపింది.. త్యాగాలు చేసింది కార్యకర్తలేనని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. కార్యకర్తల త్యాగాల పునాదుల మీదనే మందకృష్ణ మాదిగ భోగాలు అనుభవిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాదిగ అమరవీరుల కుటుంబాలతో కలిసి మాట్లాడారు. మార్చి 1వ తేదీన శనివారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా అమరవీరులకు నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. మార్చి 19వ తేదీన రాజకీయాలకు అతీతంగా మాదిగ అమరవీరుల సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని పార్టీల నేతలను, ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు పొట్టపెంజర్ రమేష్, చాప కృష్ణ, పసుల యాదగిరి, కొల్లూరి వెంకటేష్, శాంతికిరణ్, నాగరాజు, సురేష్, రాహుల్, నవీన్, దయాకర్, పరుషరాములు, వెంకట్, రాజు, ఆకాశ్, రాజేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు మొక్కుబడి

- మళ్లీ వెలసిన అక్రమ డబ్బాలు
- అక్రమ పార్కింగ్‌తో తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు
- ఫుట్‌పాత్‌పై ర్యాంపులు ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్





సుందరయ్యపార్కు ముందు వెలసిన అక్రమ డబ్బాలు, అక్రమ పార్కింగ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నెల రోజుల క్రితం సుందరయ్యపార్కు ముందర ఆపరేషన్ రోప్ పేరిట జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన కూల్చివేతలు చిరువ్యాపారుల్లో గుబులు పుట్టించింది. అయినప్పటికీ మళ్లీ అక్రమ డబ్బాలు వెలియడంతో పాటు చిరువ్యాపారులు తమ వ్యాపారాలను మళ్లీ కొనసాగించడంతో అక్రమ కూల్చివేతలన్నీ మొక్కుబడిగా సాగాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ కూల్చివేతల్లో ఎంతో కొంత నష్టపోయిన వ్యాపారుల్లో మార్పు రాకపోవడంతోపాటు ఎక్కడ కూల్చారో అక్కడే మళ్లీ డబ్బాలు వేసుకోని వ్యాపారాలు కొనసాగించడం వల్ల స్థానికులు ఇబ్బందులకు గురవుతూ విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడంతో పాదచారులతో పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. ముఖ్యంగా సుందరయ్య పార్కు ముందటి నుంచి మహిళలు నడవాలి అంటేనే ఒకింత భయాందోళనకు గురవుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసమే నిర్వహించిన ఆపరేషన్ రోప్ నిరుపయోగంగా మారింది.

◆ నగరంలో ప్రతిష్టాత్మకమైన సుందరయ్యపార్కు చుట్టూ ఉన్న ఫుట్‌పాత్‌లపై చిరువ్యాపారులు పాగా వేయడంతో ద్విచక్రవాహనాలను కింద పార్కు చేయడంతో రోడ్డు ఇరుకుగా మారింది. 10 ఫీట్ల రోడ్డుకు ఇరువైపుల వాహనాలను పార్కు చేయడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఇక్కడి నుంచి కార్లు, ఆటోలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించడంతోపాటు ద్విచక్రవాహనాల పార్కింగ్ సౌలభ్యం కోసం ర్యాంప్‌లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

◆ 15ఏళ్ల క్రితం కోఠిలోని గోకుల్ చాట్ సంఘటన ఎంతో ఆవేదనకు గురి చేస్తోంది. అక్కడ పబ్లిక్ ఎక్కువగా ఉండటంతో సంఘవిద్రోహ శక్తులు బాంబులు పెట్టి అమాయకుల ప్రాణాలను బలిగొన్నారు. అదే తరహాలో సుందరయ్యపార్కు ముందుకూగా ఉదయం సాయంత్రం పెద్ద ఎత్తున రద్దీ ఉంటుంది. గోకుల్‌చాట్ తరహాలో ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలుగా అక్కడ రద్దీ లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణలను తొలగించాలి



పార్కు చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించాలి. అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. ట్రాఫిక్ నియంత్రణ జరగడంలేదు. ఇక్కడి నుంచి మహిళలు పోవాలంటే భయపడుతున్నారు. ఎక్కడి నుంచో యువకులు వచ్చి సిగరేట్లు తాగుతూ కాలుష్యాన్ని పెంచుతున్నారు.

– అంబటి శ్రీనివాస్‌రెడ్డి, పార్క్ మాజీ అధ్యక్షుడు

ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నాం



మా పరిధిలో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ నియంత్రణ చేస్తున్నాం. సమస్య మాదృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నాం. ఆక్రమణలు ఎక్కడ ఉన్నా సహించం. చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైన ఆక్రమణలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలి.

– వీరేశం, చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

ర్యాంపులు ఏర్పాటు చేయాలి



సుందరయ్యపార్కు ఎదుట ఉన్న ట్రాక్‌ను ర్యాంపుగా ఏర్పాటు చేస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చు. అసలే 10ఫీట్ల రోడ్డు. ఇరువైపుల పార్కింగ్ వల్ల ట్రాపిక్ సమస్య పెరిగింది. ర్యాంపులు ఏర్పాటు చేస్తే వాహనాలన్నీ పైన పార్కు చేయడం వల్ల అక్రమ డబ్బాలు తొలగిపోవడంతో పాటు ట్రాఫిక్ సమస్య ఉండదు. జనవరి 17న, 23న రెండు సార్లు ఆక్రమణలను తొలగించినప్పటికీ మళ్లీ వెలిసాయి. అధికారులు స్పందించాలి. ఆక్రమణలు తొలగించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నాం. పుట్టగొడుగుల్లా షాపులు ఏర్పాటు చేయడంతో చుట్టు పక్కల నివాసం ఉంటున్న వారికి ఇబ్బందిగా మారింది. రాత్రి 11గంటల వరకు రద్దీగా ఉంటుంది. ఆడవాళ్లు పోవాలంటే ఇబ్బందిగా ఉంది.

– రవికుమార్, వాకర్

ఎస్సీలను ఏ, బీ గ్రూప్‌లుగానే విభజించాలి

ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ షమీమ్ అక్తర్‌కు మాల సంఘాల జేఏసీ వినతి

కవాడిగూడ: ఎస్సీలను ఏ,బీ,సీ,డీలుగా నాలుగు గ్రూపులు కాకుండా ఏ,బీ రెండు గ్రూపులుగానే విభజించి ఎస్సీ జాబితాలోని 59 కులాలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల నాయకులు జి.చెన్నయ్య, బేర బాలకిషన్, చెరుకు రాంచందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్సీ అధ్యయన కమిషన్ ఛైర్మన్ షమీమ్ అక్తర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 30 సంవత్సరాలుగా మాలలు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారన్నారు. ఎస్సీ ఏ-గ్రూపులో అత్యంత వెనకబడిన బ్యాగరి, నేతకాని, పాలియదాసరి, బైండ్ల, మాలదాసరి, మాల అయ్యవారు, బుడగ జంగాలు వంటి సంచార జాతులను చేర్చాలన్నారు. బీ-గ్రూపులో మాల మాదిగను చేర్చాలని డిమాండ్ చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా 2024 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ ల జనాభా 18శాతానికి పెరిగిందన్నారు. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకుని మాల, మాల ఉపకులాకు, మాదిగ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో రూ.1000 కోట్ల నిధులు కేటాయించి ఎస్సీల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఇప్పటికైనా ఎస్సీలు ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బూరుగుల వెంకటేశ్వర్లు, కరణం కిషన్, మన్నే శ్రీధర్‌రావు, ఆవుల సుధీర్, ఎస్. సత్యనారాయణ, ఎన్. నాగేశ్వర్ రావు, జి. రమేష్, దాసరి విశాల్ పాల్గొన్నారు.



కమిషన్ ఛైర్మన్‌కు వినతి పత్రం అందజేయడానికి వెళ్లిన మాల సంఘాల నాయకులు

జానపద కళాకారుల సమస్యలు పరిష్కరించాలి



జానపద కళాకారుల జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న ముళీధర్ దేశ్‌పాండే

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: జానపద కళాకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ జానపద కళాకారుల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు మురళీధర్ దేశ్‌పాండే, టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జానపద కళాకారులకు 11ఏళ్లుగా ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు కాలేదన్నారు. దీనిపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... రూ.10లక్షలను కళాబంధు కింద ఇవ్వాలన్నారు. కళాకారులకు రూ.10వేల పింఛన్, ఇందరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జానపద కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వకుంటే కళాకారులకు నిలయమైన రవీంద్రభారతిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కోలాటం, భజన బృందాలకు ఆధ్యాత్మిక ప్రచారం కోసం అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కొండూరు భాస్కర్, ఎల్లారెడ్డి, చంద్రబోస్, సంధ్య, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

తొలితరం సాహిత్యనిధి నోరి నరసింహశాస్త్రి

చిక్కడపల్లి: ఏ ప్రచార మధ్యమాలు లేని కాలంలో రచయితలు తమ సాహిత్యం ద్వారా తెలుగు భాషా సంపదను పరిపుష్టం చేయడానికి కృషి చేశారని సీబీఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీశర్మ అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో శుక్రవారం బహుముఖ పండితుడు నోరి నరసంహశాస్త్రి యాదిలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ నాగ మారుతీశర్మ మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా రేపల్లె నగరవాసి నోరినరసింహశాస్త్రి తన యవ్వనంలోనే సాహిత్య రచన ప్రారంభించారని అన్నారు. న్యాయవాద వృత్తిలో రాణిస్తూ రచనా రంగంలోనూ కీర్తి పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో కవి వ్యాఖ్యాత పెద్దురి వెంకటదాసు, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన వేదికపై నాయకులు రామ్ కుమార్, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

వెంటిలేటర్‌పై విద్యారంగం.. సీఎంకు విద్యార్థుల లెటర్



సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలు చూపిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

ముషీరాబాద్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల చేయాలని పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో స్థానిక విద్యానగర్‌లోని వివేకానంద డిగ్రీ కాలేజీ, ఏఆర్‌కే డిగ్రీ కాలేజీలలోని విద్యార్థులు సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్‌లో లేఖలు రాసి పంపించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపొంగి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మందనవీన్, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో వెంటిలేటర్‌పై ఉన్న విద్యారంగాన్ని కాపాడాలంటే ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యారంగ సంస్థలలో నిధుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

◆ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ విద్యారంగాన్ని బాగు చేయాలంటే 15 శాతం నిధులు కేటాయిస్తామని.. అలాగే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని... రాష్ట్రంలోని చదువుకునే ప్రతి విద్యార్థికి ఐదు లక్షల విద్యా భరోసా కార్డులు ఇస్తామని.. మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్‌ని ఏర్పాటు చేస్తామని.. చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత వీటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత సంవత్సరం 7.3 శాతం నిధులు మాత్రమే నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నారని అన్నారు.. తద్వారా గత కేసీఆర్ ప్రభుత్వానికి నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఎలాంటి తేడా లేదన్నారు. ఫీజు బకాయిలను విడుదల చేయాలన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. అదే విధంగా అసెంబ్లీని కూడా ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గడ్డం గౌతం, సహాయ కార్యదర్శులు ఆసిఫ్, తీగల శ్యామ్, జిల్లా నాయకులు మౌనిక, జాహ్నవి, అనూష తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. అయ్యప్ప టెంపుల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 12.30 వరకు సాయిదత్తా నర్సింగ్‌హోం, టెలిఫోన్ ఎక్స్‌చేంజ్, శివం, ఎరుకల బస్తీ తదితర ప్రాంతాలలో.. సాయిబాబా టెంపుల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు సాయిబాబా కమాన్, ఆంధ్రాబ్యాంక్, వి.హనుమంతరావు హౌస్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వృద్ధురాలు అదృశ్యం



భాగ్యమ్మ (ఫైల్)

కవాడిగూడ: గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూతురు కుమారుడు డిశ్చార్జ్ అయ్యి ఇంటికి తీసుకొస్తుండగా ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన దోమలగూడ మైసమ్మ బండలో జరిగింది. ఎస్సై శాంతి తెలిపిన వివరాల ప్రకారం... దోమలగూడ మైసమ్మబండలో నివాసం ఉండే తన కూతురు శోభ కుమారుడు ఇటీవల 23వ తేదీన అనారోగ్యంతో గాంధీ ఆస్పత్రిలో చేరాడు. అతడిని ఈ నెల 26వ తేదీ రాత్రి డిశ్చార్జ్ చేస్తున్నారని బంధువులతో కలిసి శోభ తల్లి భాగ్యమ్మ (61) గాంధీ ఆస్పత్రికి వెళ్లింది. వచ్చే క్రమంలో ఆమె కనిపించలేదు. కుటుంబసభ్యులు గాంధీ ఆస్పత్రి పరిసరాల్లో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో వారు దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యాదమ్మ ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పీఎస్‌లో లేదా ఫోన్ నం. 82716 61526లో సమాచారం అందించాలని కోరారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

అంబర్‌పేట: దోమల బెడదను తక్షణమే నివారించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్ఎంసీ, ఎంటామాలజీ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాలతో పాటు మూసీ పరీవాహక ప్రాంతాల్లో దోమల సమస్య తీవ్రతపై శుక్రవారం గోల్నాకలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎంటమాలాజీ విభాగం అధికారులు, సిబ్బంది దోమలను అరికట్టడంలో తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఇటీవల దోమల బెడదపై ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఆయన తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమలతో పేదలు అనారోగ్యల బారిన పడుతున్నారని నిర్లక్ష్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన దోమలను అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎంటమాలజీ అధికారులు అంబికా, దుర్గాప్రసాద్, వెంకయ్య, అజయ్ పాల్గొన్నారు.



ఎంటమాలజీ అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ



భరత్‌నగర్‌లోని రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: డివిజన్‌లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం డివిజన్‌లోని భరత్‌నగర్, సమీపంలోని మసీద్ పరిసరాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె ఆ ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. రంజాన్ సమీపిస్తున్న నేపథ్యంలో అంతర్గత రోడ్లు, పారిశుద్ధ్య, డ్రైనేజీ వంటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు బీఆర్‌ఎస్ నేతలు బి.వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని బాప్టిస్ట్ చర్చ్ వీధిలో కచ్చానాలా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం బాప్టిస్ట్ చర్చ్ వీధిలో కొనసాగుతున్న కచ్చా నాలా నిర్మాణ పనులను కార్పొరేటర్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్‌లో సమస్యలు ఉత్పన్నం కాకుండా నాలాలో పూర్తిగా పూడికతీత పనులు చేపట్టి నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. గతంలో చిన్నపాటి వర్షానికే ఇళ్లలోకి మురుగునీటి ప్రవాహం వచ్చేదని గుర్తు చేశారు. రాబోయే వర్షాకాలంలో సమస్యలు పునరావృత్తం కాకుండా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు అనిల్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సత్యానారాయణ, వేణు, ముత్యాలు, బాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి



అంబేడ్కర్ కళాశాలలో జరిగిన నేషనల్ సైన్స్ డేలో పాల్గొన్న ప్రిన్సిపాల్ మట్టా శేఖర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అంబేడ్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ కళాశాలలో సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టా శేఖర్ మాట్లాడుతూ... నేడు సైన్స్ ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ ఇంకా మూఢ నమ్మకాల వైపు మొగ్గు చూపడం బాధాకరమని అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారు కూడా మూఢ నమ్మకాలవైపు మళ్లడం సరికాదన్నారు. విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకొని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. అల్లోపతి, ఆయుర్వేదిక్, యునానీ, హోమియోపతిలకు సంబంధించిన మెడికల్ క్యాంపు జరిగింది. మెడికల్ క్యాంపులో ఆరోగ్య పరీక్షలు చేసుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున్ యాదవ్, జి.మనీష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బండ్ల శ్రీధర్, కుమారస్వామి, డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'వైజ్ఞానిక ప్రదర్శనలతో నైపుణ్యాల పెంపొందుతాయి'

నల్లకుంట: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందుతాయని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం న్యూనల్లకుంట లింగాలగడ్డ శివాలయం సమీపంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేట్ లావణ్య భారతరత్న చంద్రశేఖర్ వెంకటరామన్(సీవీ రామన్) చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు రూపొందించి ప్రాజెక్టులను పరిశీలించారు. రోడ్లు, భవనాలు, నీటి వనరుల వైవిధ్యం. డ్యాన్సింగ్ లైట్, ఇంకుడు గుంతలు, కార్బన్ వ్యర్థాల శుద్ధి, సోలార్ ప్యానెల్స్, ఆరోగ్యం- పరిశుభ్రత ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయని ఆమె పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతోనే విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్ ఉంటుందని చెప్పారు. మానవాళి పురోగతికి మూలాధారం విజ్ఞానమని, శాస్త్ర పరిశోధనల్లో నేటి యువత రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ స్వరూ, ఉపాధ్యాయురాలు సరిత, అలేఖ్య, అశోక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉచిత మెడికల్ క్యాంపులో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థులు



సెయింట్ మేరీ పాఠశాలలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లావణ్య